బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- మృతి చెందిన యాదయ్య కుటుంబానికి బీమా అందజేత

యాదయ్య కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, పార్టీ నాయకులు

వికారాబాద్, మార్చి 17 : బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త నల్ల యాదయ్య మృతి చెందడంతో అతడి కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమా కార్యకర్తలకు ధీమా అని అన్నారు. యాదయ్యకు సభ్యత్వ నమోదు ఉండడంతో పార్టీ తరపున రూ.2లక్షల బీమా అతడి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు భరోసానిస్తుందన్నారు. తెలంగాణలో త్వరలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆరంభమవుతుందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం చేయించుకోవాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు చేయించుకుంటే దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగి ఆ వ్యక్తి మృతి చెందితే రూ.2లక్షల బీమా పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

కాంగ్రెస్‌ను మరోసారి నమ్మే స్థితిలో లేరు..

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయే పరిస్థితిలో లేరని మెతుకు ఆనంద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిస్థితి చాలా దారుణంగా తయారయిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మీద గ్రామాల్లో ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉదయం లేస్తే కేసీఆర్‌ను విమర్శించడం, ప్రతిపక్ష నాయకుల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తప్పా... ప్రజా సేవలపై దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ మాత్రం అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రతిక్షణం ప్రజల గురించి మాత్రమే ఆలోచిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నారెగూడెం మహిపాల్ రెడ్డి, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గయాజ్, మాజీ కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, రామస్వామి, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు పడిగల్ల అశోక్, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి గాండ్ల మల్లికార్జున్, మాజీ సర్పంచ్ అంజయ్య పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, మార్చి 17 : తెలంగాణ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి మండిపడ్డారు. శాసన మండలిలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును సోమవారం ఎమ్మెల్సీ ఎక్కడికక్కడ ఎండగట్టారు. ఇప్పుడు పెండ్లి చేసుకోకండి.. మేము అధికారంలోకి వచ్చాక చేసుకుంటే కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. నిండు సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇవ్వలేమని చెప్పడం సిగ్గు చేటన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి కల్యాణమస్తుగా పేరు మార్చారే తప్పా తులం బంగారం ఇవ్వడం మాత్రం మరిచిపోయారన్నారు. జీవో 317 పరిస్థితి ఏమిటని, ఉద్యోగులు డీఏ అడగవద్దని సీఎం చెప్పడం దేనికి సంకేతమన్నారు. జీవో 317ను ఎత్తివేస్తారా? లేదా అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ప్రజావాణికి 144 ఫిర్యాదులు

వికారాబాద్ : ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 17 : ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి 144 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూసర్వే తదితర సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదులు అందజేశారని తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డిలో 72 ఫిర్యాదులు

ఆదిబట్ల : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయ మందిరంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను డీఆర్‌వో సంగీతతో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 72 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదిబట్ల: ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేయాలి

కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో సమావేశమైన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, మార్చి 17 : చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ, బీజేపీ పార్లమెంటరీ విప్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీ సౌత్ బ్లాక్‌లో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తోఎంపీ సమావేశమయ్యారు. మారుమూల ప్రాంతమైన తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్, చేవెళ్ల నియోజకవర్గ విద్యార్థినీ విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిట్‌ను వికారాబాద్‌లో ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి భావనతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందని మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే సానుకూలంగా స్పందించినట్లు గుర్తు చేశారు. వికారాబాద్‌లో ఉన్న అనంత పద్మనాభ స్వామి కళాశాల ప్రాంగణంలోని భవనంలో ఈ యూనిట్ ఏర్పాటు చేసేందుకు కళాశాల యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసి, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాసిందని ఎంపీ చెప్పారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ఈ యూనిట్ ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించడంతో చిరకాలంగా ఎదురుచూస్తున్న వికారాబాద్ ప్రాంత వాసుల కల నెరవేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, మార్చి 17 : ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో పాటు ఎస్పీ హాజరై ప్రజలు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖాతాదారులు బ్యాంకింగ్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే ఇందు కోసం నిర్దేశించిన వెబ్‌సైట్ www.cybercrime.gov.in సందర్శించవచ్చన్నారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే, కేవైసీలకు అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వెబ్‌సైట్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని తెలిపారు. సెల్‌ఫోన్‌లో వచ్చే రుణ యాప్‌ల జోలికి పోవద్దన్నారు. కార్యక్రమంలో సీఐలు నగేశ్, సంతోశ్‌కుమార్, ఎస్సైలు శంకర్, రమేశ్, ట్రాఫిక్ సిబ్బంది, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు జయ ప్రసాద్, కార్యదర్శి అనిల్ కుమార్, సభ్యులు శివమోహన్ రెడ్డి, వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర యూత్ కార్యదర్శి రొంపల్లి సంతోశ్‌కుమార్, మార్వాడి యువ మంచ్ జాతీయ సభ్యుడు మనోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య యూత్ కార్యదర్శి రొంపల్లి సంతోశ్‌కుమార్‌తో కలిసి ఆటో డ్రైవర్లకు యూనిఫాంలు అందజేశారు. ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని, పార్కింగ్ నిబంధనలను పాటించాలని సూచించారు.

నేరాల నియంత్రణకు మూడో కన్ను

తాండూరు రూరల్ : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కరణ్‌కోట పోలీసు స్టేషన్‌లో అదాని సిమెంట్ కంపెనీ, కరణ్‌కోట ఎస్‌బీఐ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 40 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పాటునందిస్తాయని తెలిపారు. కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి చొరవ తీసుకొని పోలీసు స్టేషన్ పరిధిలో 108 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నేరం జరిగిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా త్వరగా నేరస్తులను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నగేశ్, ఎస్సై విఠల్‌రెడ్డి, పలువురు పుర ప్రముఖులు రాంరెడ్డి పటేల్, శకుంతల దేశ్‌పాండు, మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, జన్నె నాగప్ప, తదతరులు ఉన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థి అదృశ్యం

మూడావత్ శంకర్ (ఫైల్)

కులకచర్ల, మార్చి 17 : గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమైన ఘటన కులకచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అన్వేశ్ రెడ్డి తెలిపిన వివరాలు.. చౌడాపూర్ మండల పరిధిలోని పాచావ్‌కుంట తండాకు చెందిన మూడావత్ శేఖర్ (15) కులకచర్ల మండలం బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న గురుకుల పాఠశాల నుంచి రాత్రి వేళలో ఎవరికీ చెప్పకుండా, సీసీ కెమెరాల్లో కూడా పడకుండావెళ్లిపోయాడు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే వారు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో సోమవారం విద్యార్థి తండ్రి భద్రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోలీసులు పాఠశాలలో సీసీ కెమెరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ విద్యార్థి ఎవరికైనా కనిపిస్తే 9154123326 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రిన్సిపాల్ హామీతో సద్దుమణిగింది..

వికారాబాద్, మార్చి 17 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆరో తరగతి చదువుతున్నాడు. మార్చి 13న అతడిని తీసుకెళ్లేందుకు స్కూల్‌ను వచ్చిన తండ్రికి ఆ విద్యార్థి ఓ టీచర్ కొట్టిందని.. ఆ టీచర్ ఉంటే తాను పాఠశాలకు వెళ్లనని చెప్పాడు. దీంతో స్టూడెంట్ తల్లిదండ్రులు సోమవారం ఈ విషయమై సీడబ్ల్యూసీ చైల్డ్‌లైన్‌కు, వికారాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కాగా పాఠశాల ప్రిన్సిపాల్ హామీతో ఆ వివాదం సద్దుమణగడంతో విద్యార్థి తల్లిదండ్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 17 : ఓయూ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆగస్టులో జరిగిన ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాక్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని తెలిపారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ (రెగ్యులర్), బీబీఏ (బిజినెస్ అనాలటిక్స్), బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్), బీబీఏ (లాజిస్టిక్స్), బీబీఏ(ఫ్యాషన్ మేనేజ్‌మెంట్), బీబీఏ (ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్) తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 8 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

పీజీ కోర్సుల వన్‌టైమ్ చాన్స్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని పీజీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ వన్ టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఎంఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్ష ఫీజును స్వీకరిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 25లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 28 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

- పనులే చేయని మేట్‌లకు వంద రోజుల హాజరు
- రికార్డుల్లో వివరాలు నమోదు చేసి నిధులు స్వాహా
- సామాజిక తనిఖీలో బయటపడిన వైనం

సామాజిక తనిఖీలో మేట్‌లను ప్రశ్నిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

బంట్వారం, మార్చి 17 : ఉపాధి పనుల్లో అక్రమాలు వెలుగుచూశాయి. పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి సోమవారం మండల పరిషత్ ఆవరణలో సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.6,85,42,294 నిధులతో చేపట్టిన పనులకు కూలీల రికార్డుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. సల్బత్తాపూర్‌లో కూలీలను ప్రతిరోజూ పనులకు తీసుకెళ్లి గ్రూపుల వారీగా పనులు చేయించే మేట్‌లు నరేందర్‌రెడ్డి, గోవర్ధన్, బలరాం, సంజీవ్, శ్రీనివాస్ ఎలాంటి పనులు చేయకున్నా 100 రోజులు పనులు చేసినట్లు రికార్డులు నమోదు చేసి, నిధులు స్వాహా చేసినట్లు సభలో ఆర్పీ వివరించారు. ఈ అక్రమాలపై ఎఫ్ఏ రవిని ఎందుకు సస్పెండ్ చేయొద్దని డీఆర్‌డీవో శ్రీనివాస్ ప్రశ్నించారు. యాచారం జీపీలో కాలువిరిగి మంచానపడిన ఓ మహిళ పేరున కూలీ పనులు చేసినట్లు రికార్డులు చేసి, నిధులు మింగారు. దీనిపై సామాజిక తనిఖీ బృందం ఇంటింటికెళ్లి విచారించగా సదరు మహిళ ఐదేండ్లుగా పనులు చేయడం లేదని చెప్పిందన్నారు. అలాగే మస్టర్ రికార్డులోనూ సంతకాలు చేసి ఉన్నా, సదరు కూలీలు ఎలాంటి పనులు చేయలేదని చెప్పారని ఆర్పీలు వివరించారు. ఇలాంటి తప్పిదాలు అన్ని పంచాయతీల్లోనూ వెలుగులోకి వచ్చాయని వివరించారు. కూలీ పనులకు రూ.6,76,81,875, మెటీరియల్ పేమెంట్ రూ.8,60,419 లపై సామాజిక తనిఖీ నిర్వహించారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన రికార్డులు తనిఖీ బృందానికి ఇవ్వకపోవడంతో సదరు పనులకు ఎలాంటి సామాజిక తనిఖీ నిర్వహించలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, అంబుడ్స్‌మన్ గుర్రం రాములు, ఎస్ఆర్పీ రమేశ్, ఏపీడీ సరళకుమారి పాల్గొన్నారు.

వివరాలు వెల్లడించని అధికారులు

సామాజిక తనిఖీ ప్రజా వేదిక ముగియగానే అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాలి. వివరాలు వెల్లడించకుండానే సభను ముగించేశారు. సామాజిక తనిఖీలో ఎన్ని పనులకు తనిఖీ నిర్వహించారు, ఎన్ని అక్రమాలు చోటు చేసుకున్నాయి, ఎంత మొత్తం రికవరీకి ఆదేశాలు జారీ చేశారో వివరాలు చెప్పలేదు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వివరించ లేదు. కాగా సామాజిక తనిఖీలో వెలుగు చూసిన తప్పిదాలను కప్పిపుచ్చుకొనేందుకు పలువురు అధికారులకు ఫామ్‌హౌస్ లో విందు భోజనాలు ఏర్పాటు చేయగా.. అక్కడికి అధికారులు ఎలా వెళ్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తనిఖీలో పాల్గొన్న సిబ్బంది, ఇతరులకు స్థానికంగానే భోజనాలు ఏర్పాటు చేసి, కేవలం సదరు అధికారులకు ఫామ్‌హౌస్‌లో ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నిస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

ఆదిబట్ల, మార్చి 17 : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఈ నిధులను ఐసీడీఎస్‌కు కేటాయించాలన్నారు. మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేసి, ఐసీడీఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధాన చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసహరించుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మా సమస్యలను పరిష్కరించని పక్షంలో రెండు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి రాజ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, రుద్రకుమార్, నాయకులు కుమార్, దేవేందర్, స్వప్న, రవి, నాయకులు కృష్ణ, ఎల్లేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ఓయూ

సర్క్యులర్‌పై ఆగ్రహావేశాలు.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు వెళ్తున్న విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలను నిషేధిస్తూ అధికారులు సర్క్యులర్ విడుదల చేసిన నేపథ్యంలో ఓయూలో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మెయిన్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఓయూ వీసీ, ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినదించారు. పోలీసులు అడ్డుకోగా విద్యార్థులు ప్రతిఘటించారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. విద్యార్థి నాయకులనుపోలీసులు అదుపులోకి తీసుకొని అంబపేట, నల్లకుంట పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తమ హక్కుల కోసం పోరాడే విద్యార్థులను అణగదొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రీన్ మ్యాట్ రూఫ్‌లు లేక...

సిటీబ్యూరో: రెండు నిమిషాల సిగ్నల్స్ వద్ద వెయింటింగ్ చేస్తున్న వాహనదారులు ఎండల వేడికి వడదెబ్బ తగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్స్ రూఫ్‌లను ఏర్పాటు చేయాల్సిన జీహెచ్ఎంసీ మీనమేషాలు లెక్కిస్తున్నది. గత ఏడాది ప్రయోగాత్మకంగా లిబర్టీ చౌరస్తాలో గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేసిన అధికారులు.. ప్రస్తుతం ఏ కూడళ్లలోనూ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. వాహనదారులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ య